# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 139 వ భాగం

## సూర్య వంశం – 8 ; హరిశ్చంద్రుడు

క్రితం వ్యాసంలో చివర్లో హరిశ్చంద్రుడి గురించి చెప్పుకున్నాం. ఈ హరిశ్చంద్రుడు మాట తప్పనివాడు అని తెలిసాక రాజులందరూ ఎలాగా అబద్ధాలు ఆడతారులే, ఈయన్ని పరీక్షిద్దాం అనుకుని విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి సంపద అంతా కొల్లగొట్టాడు. అప్పటికీ అబద్ధం ఆడనప్పుడు కాశీలో మణికర్ణిక అనేచోట కాటికాపరిగా అయినా స్వంత భార్యా, కొడుకూ చనిపోయినా అబద్ధం అనేది ఆయన నోట్లోంచి రాలేదు. ఇదంతా వశిష్టుడు గమనించాడు – తన రాజుని విశ్వామిత్రుడు అష్టకష్టాలు పాలు చేయడం.

వ. ఇట్లు విశ్వామిత్రుండు హరిశ్చంద్రు నెగులపఱచుట విని వసిష్ఠుండు విశ్వామిత్రునిఁ గృధ్రమ్మవు గమ్మని శపించె; విశ్వామిత్రుండును వసిష్ఠుని బకంబవు గమ్మని శపించె; పక్షిరూపు లయ్యును వైరంబు మానక యయ్యిరువురును యుద్ధంబు చేసి రంత హరిశ్చంద్రుండు పుత్రులు లేక నారదు నుపదేశంబున వరుణోపాసనంబు నతి భక్తితోఁ జేయ నా వరుణుండు ప్రత్యక్షంబైన నతనిక మ్రొక్కి యిట్లనియె. [9-193]

వీళ్ళిద్దరు కోపంతో నువ్వు గెద్దవి (గృధ్రము) అయిపో అంటే నువ్వు కొంగవి (బకము) అయిపో శపించుకున్నారు. అయినా శతృత్వం పోలేదు. ఈ లోపుల హరిశ్చంద్రుడు పిల్లల కోసం నారదుడు చెప్పినట్టూ వరుణ్ణి ఉపాసించాడు. కొడుకు కావాలి అని అడిగితే పోను కానీ ఏమడిగాడో చూడండి.

ఆ. వరుణదేవ! నాకు వరవీరగుణముల
కొడుకు పుట్టెనేని కొడుకుఁ బట్టి
పశువుఁ జేసి నీవు పరిణమింపఁగ వేల్తుఁ
గొడుకు నీఁ గదయ్య కొసరు లేక. [9-194]

నాకు మంచి వీరుడయ్యే కొడుకుని ప్రసాదించు. అలా పుట్టినవాణ్ణి నీకు బలిపశువుగా ఇస్తాను నువ్వు సంతోషించేటట్టుగా అని అడిగాడు. ఈ పద్యంలో "పరిణమింపగ" అంటే సంతోషం కలిగేలా.

వ. అని పలికినం గుమారుండు గలిగెడు మని వరంబిచ్చి వరుణుండు చనియె; నంత హరిశ్చంద్రునకు వరుణప్రసాదంబున రోహితుఁడను కుమారుండు జన్మించె; వరుణుండును హరిశ్ఛంద్రకుమారు నుద్దేశించి. [9-195]

సీ. పురిటిలోపల వచ్చి పుత్రు వేలుపు మన్న
బురుడు బోయినగాని పొసఁగ దనియె;
బలురాకమును వచ్చి బాలు వేలుపు మన్న
బండ్లు లేకుండ నభావ్యుఁ డనియెఁ;
బండ్లు రాఁజూచి డింభకుని వేలుపు మన్న
బడి పండ్లురామి నభావ్యుఁ డనియె;
బడిపండ్లు పొడమినఁ గొడుకు వేలుపు మన్న
బోరుల కొదవక పోల దనియెఁ; [9-196]

ఆ. దొడరి యిట్టు గొడుకుతోడి మోహంబునఁ
బ్రొద్దు గడుపుచుండె భూవరుండు
దండ్రి తలఁపుకొలఁది దనలోనఁ జింతించి
యింట నుండ కడవి కేఁగెఁ గొడుకు. [9-196.1]

రోహితుడు అనే కొడుకు పుట్టగానే వరుణుడు వచ్చి అడిగాడు. అబద్ధం ఆడని హరిశ్చంద్రుడు కదా అయినా ఇప్పుడు కొడుకుని ఇమ్మంటే సాకులు చెప్తున్నాడు. మొదట్లో పురిటిలో ఉన్నవాడు ఇప్పుడు ఇవ్వకూడదు అనీ, అదయ్యాక పళ్ళు రాలేదనీ అవి వచ్చాక పాలపళ్ళు పోయి మామూలు దంతాలు రావాలనీ, ఆ తర్వాత యుద్ధాలు అవీ చేయకుండా కుదరదనీ అలా అనేకానేక సాకులు చెప్తున్నాడు. ఇదంతా కొడుకు చూసి విసుగెత్తి తండ్రికి అబద్ధం ఆడిన మాట రాకుండా అడవిలోకి వెళ్ళిపోయాడు.

వ. ఇట్లు వనంబునకుఁ జని శరశరాసన ధరుండయి రోహితుండు దిరుగుచుండి వరుణగ్రస్తుండై హరిశ్చంద్రుండు మహోదరవ్యాధిచేఁ బీడితుండుగా నుండుట విని పురంబునకుం దిరిగిరా గమకింప నింద్రుండు ముసలి తపసియై వచ్చి నిట్లనియె. [9-197]

క. పుణ్యభూము లరుగు; పుణ్యతీర్థంబులఁ
గ్రుంకు; పుణ్యజనులఁ గోరి చూడు;
పుణ్యకథలు వినుము భూపాలపుత్రక!
మేలు గలుగునట్టి మేర గలదు. [9-198]

వ. అని యిట్లు మగిడించినం దిరిగి చని రోహితుం డొక్క యేఁ డవ్వనంబునం దిరిగి క్రమ్మఱఁ జనుదేర నింద్రుండు వచ్చి తొంటి యట్ల నివారించె; ఇవ్విధంబున. [9-199]

కొంతకాలానికి వరుణుడి కోపం వల్ల వ్యాధిగ్రస్థుడయ్యాడు హరిశ్చంద్రుడు – మాట నిలబెట్టుకోనందుకు. ఈ సంగతి తెల్సి రోహితుడు ఇంటికి బయల్దేరేసరికి ఇంద్రుడు చెప్పాడు పుణ్య క్షేత్రాలు చూడు, మిగతా పుణ్యపురుషులతో మాట్లాడు కానీ ఇంటికి వెళ్ళవద్దు. ఇలా మరో సంవత్సరం మరోటీ అయ్యి అయిదేళ్ళు రోహితుణ్ణి ఇంటికిరాకుండా ఆపాడు ఇంద్రుడు. ఆరో ఏడు ఇంటికి వస్తూంటే దారిలో కనబడిన శునశ్శేపుడు అనే కుర్రాణ్ణి తన బదులుగా తీసుకొమ్మని హరిశ్చంద్రుడితో చెప్పాడు ఇంటికి వచ్చిన రోహితుడు. ఈ శునశ్శేపుడి కథ వేరే.

ఇక్కడనుంచి కథ మరో తరానికీ మరో తరానికీ పాకి బాహుకుడు అనే ఆయన దగ్గిరకి వచ్చింది.

సీ. దండించి పగవారు దనభూమిఁ జేకొన్న-
నంగనలును దాను నడవి కేఁగి
యడవిలో ముసలియై యాతఁడు చచ్చిన-
నాతని భార్య దా ననుగమింపఁ
గదియుచో నా స్త్రీకి గర్భంబు గలుగుట-

యౌర్వమునీశ్వరుఁ డాత్మ నెఱిఁగి
వారించె; నంత నవ్వనజాక్షి సవతులు-
చూలు నిండారినఁ జూడఁ జాల [9-202]

తే. కర్థి నన్నంబు గుడుచుచో నందుఁ గలిపి
విషము పెట్టిరి; పెట్టిన విరిసి పడక
గరముతోఁ గూడ సగరుండు ఘనుఁడు పుట్టి
వరయశస్ఫూర్తితోఁ జక్రవర్తి యయ్యె. [9-202.1]

ఈ బాహుకుడి శత్రువులు ఆయన రాజ్యం లాక్కుంటే ఆయన అడవిలోకి వెళ్ళి చనిపోయాడు. బాహుకుడి భార్య కూడా చావాలనుకుంది కానీ ఆవిడ గర్భవతి అని తెల్సి ఔర్వుడనే ముని వారించాడు. అయినా ఆవిడకున్న సవతులు ఈ కడుపులో ఉన్న కొడుకుని చంపడానికి విషం పెట్టారు. ఆయుర్దాయం ఉంటే వాడే బతుకుతాడు అన్నట్టూ విషంతో (గరము) పాటు కొడుకు పుట్టాడు. విషంతో పాటు పుట్టాడు కనకే ఈయన పేరు సగరుడు. ఆ సగరుడు తండ్రి నుంచి రాజ్యం లాక్కున్నవారినందర్నీ జయించి చక్రవర్తి అయ్యాడు. ఈ సగరుడి మీదనే సముద్రానికి సాగరం అనే పేరూ, గంగ భువికి దిగడం అనే కథలు వరసగా వస్తాయి. అవి ఇంతకుముందు గంగావతరణం అనే వ్యాసపరంపరలో చదివాం (పోతన భాగవతంలో రసగుళికలు-45 నుంచి 48 వరకూ). సగరుడి కొడుకు అసమంజసుడు. ఆయనకి అంశుమతుడు పుట్టాక అంశుమంతుడి కొడుకు దిలీపుడు, దిలీపుడికి భగీరథుడి దాకా ఈ సూర్య వంశం సాగింది. ఈ భగీరథుడే గంగని భూమికి దించినది. ఆయన పేరు మీదే గంగ భాగీరధి.

భాగీరథుడి నుంచి వంశం సాగి సాగి సుదాసుడు అనే ఆయన దగ్గిరకి వచ్చింది. ఈ సుదాసుడికే మిత్రసహుడనీ, కల్మాషపాదుడనే మరో మారు పేరు. పరీక్షిత్తు ఈ పేరెలా వచ్చింది అని అడిగితే శుకమహర్షి ఈ కల్మాషపాదుడి కథ చెప్తున్నాడు.

సీ. ఆ సుదాసుఁడు వేఁటకై వనంబున కేగి-
గర్వించి యొక్క రక్కసునిఁ జంపి

వానితోఁ బుట్టిన వానిఁ బో విడిచిన-
వాఁడును దనతోడివాని చావు
పోనీక కపటియై భూపాలుగృహమున-
నడబాలతనమున నర్థిఁ గొలిచి
యుండ వసిష్ఠున కుర్వీశుఁ డొక్కనాఁ-
డన్నంబు జేయంగ నతనిఁ బనుప [9-237]

తే. వాఁడు మానవ మాంసంబు వండి తెచ్చి
మునికి వడ్డింపఁ గోపించి ముని నరేంద్రుఁ
బిలిచి మనుజామిషంబును బెట్టి తనుచు
నలుకతో రాక్షసుఁడవు గమ్మని శపించె. [9-237.1]

ఈ సుదాసుడు వేటకెళ్ళి ఒక రాక్షసుణ్ణి చంపాడు. అక్కడే ఉన్న రాక్షసుడి తమ్ముణ్ణి పోనీలే విడిచిపెడితే వాడు కోపంతో పగ తీర్చుకోవడానికి సుదాసుడి ఇంట్లో మారువేషంలో వంటవాడిగా వచ్చి చేరాడు. వశిష్టుడు ఒకసారి వచ్చినప్పుడు భోజనానికి ఆహ్వానించాడు రాజు. అందులో ఈ రాక్షస వంటవాడు నరమాంసం వండి పెట్టేసాడు. రాజుకీ సంగతి తెలియదు. తనకి పెట్టినది నరమాంసం అని తెలియగానే వశిష్టుడికి కోపం వచ్చి నువ్వు రాక్షసుడివి అయిపో అంటూ శపించాడు రాజుని. ఈ సీస పద్యంలో వంటవాడు అనేది ఎక్కడుందో చూసారా? అడబాలతనము – వంటవాడి పని.

అయితే తర్వాత తెల్సింది రాజు తప్పులేదని. అందువల్ల శాపం సవరించి 'పన్నెండేళ్ళు మాత్రం రాక్షసుడివిగా ఉండు'; అని మార్చాడు. రాజుకి కూడా కోపం వచ్చింది. గురువు అయితే మాత్రం ముందూ వెనకా చూసుకోకుండా శపించేయకూడదు కదా? ఈయన కూడా చేతులోకి నీళ్ళు తీసుకుని గురువుని శపించడానికి తయారయ్యాడు.

మ. గురువున్ మాఱుశపింతు నంచు జలముల్ గోపంబుతో దోయిటన్
నరనాథుండు ధరింపఁ దత్సతి పతిన్వారింప మిన్నుం దిశల్

ధరయున్ జీవమయంబకా నిఖిలముం దాఁ జూచి చల్లెన్ ధరా
వరుఁ డాత్మీయపదంబులం గరపుటీవాఃపూరముం బొక్కుచున్. [9-239]

ఇలా నీళ్ళు చేతిలోకి తీసుకుని గురువుని శపించడానికి సిద్ధమౌతూంటే వాళ్ళావిడ (తత్పతి) మొగుణ్ణి వారించింది (పతిన్వారింప) – అలా గురువులని శపించకూడదు అంటూ. అందువల్ల ఆయన భార్య మాట విని, కోపం తగ్గించుకుని ఆ నీళ్ళు తన కాళ్ళమీదే పోసుకున్నాడు (ఆత్మీయ పదంబులన్). దీనికి కారణం ఏమంటే దశదిశల్లో, భూమ్మీద, ఆకాశంలో అనేక జీవాలు తిరుగుతూ ఉంటాయి (మిన్నుం, దిశల్, ధరయున్ జీవమయంబు). తన శాపం వల్ల వాటికి అపకారం జరగకూడదు కదా. ఈ పద్యంలో చివరి పాదం సరిగ్గా గమినించారా? కరపుటీవాఃపూరమున్ అంటే కర – చేతిలో పుటీ – పిడికెట్లో, వాఃపూరము – నీళ్ళు

వ. ఇట్లు మిత్రసహుండు గావునఁ గళత్రానుకూలుండై శపియింప నొల్లక సుదాసుండు రాక్షస భావంబు నొంది, కల్మషవర్ణంబు లయిన పాదంబులతో నడవులం దిరుగుచు. [9-240]

పై పద్యం, వచనం చెప్పినట్టే జీవాలన్నింటినీ సమానంగా చూసేవాడు కనక ఆయన మిత్రసహుడు, కానీ నీళ్ళు భార్య చెప్పినట్టూ కాళ్ళమీద పోసుకోవడంతో కల్మాషపాదుడు అయ్యాడు. శాపం వల్ల రాక్షసుడై నల్లగా కమిలిపోయిన పాదాలతో అడవుల్లో తిరగడం సాగించాడు. రాముడు పుట్టడానికి ఇంకా కొన్ని తరాలు ఉంది. అవన్నీ ముందు ముందు చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS